# మువ్వలు రాలిన పాట

మాగాం చేస్తోన్న తమ్ముణ్ని బడి వద్దకు వెంటబెట్టుకొచ్చింది ఆమె. తుమ్మెద రెక్కల్లాంటి కనురెప్పల్ని పైకెత్తి నాకేసి ఓసారి చూసి వాణ్ని గడపదాటించి వెనుదిరిగింది.

ఆమె వెళ్లిందిగాని ఆమె రూపం నా కళ్లగుమ్మంలో చాలాసేపు చెరిగిపోకుండా నిల్చుంది. ఇన్ని రోజులుగా బడికొస్తోన్నా నాకేనాడూ కన్పించలేదు ఆమె. రాగిపైరులో ఏపుగా పెరిగి నిండుగా పూసిన ఆవాల మండలాగుంది.

మళ్లీ మళ్లీ చూడాలనిపించే అందం.

పల్లెదనం మూర్తీభవించిన రంగుల చిత్రం.

తర్వాత పదిరోజులకు అనుకొంటాను ఆమె తమ్ముడు సుధాకర్ బడికి రాలేదు. పిల్ల జవాన్లను పంపితే, వాడు లొంగలేదంటూ ఉత్తచేతుల్తో వచ్చారు.

నేనే వెళదామనుకొంటోన్న తరుణంలో తమ్ముని వెంటబెట్టుకొచ్చింది ఆమె.

"నిన్నా మొన్నా మిరప పండ్లకాడ కావిలున్నేడు సార్! ఈ రోజు నువ్వు కొడ్తావని అంకేసిండు. కొట్టగాకు సార్!" అందామె చిరునవ్వు వెలిగే మొహంతో.

"బడికి ఎగ్గొట్టించింది కాకుండా మళ్లీ మామీద అపనిందలా?" అన్నాను నవ్వుతూ.

కళ్లెత్తి నాకేసి చూసింది. "ఏం జెయ్యాలసార్! అందరం మిరపకాయలు కొయ్యడానికి పోవాల్సొచ్చె. కల్లంలో కావిలుండేందుకు మనిసి లేకపోయ. నోటికాడికొచ్చిన పంటగదా!"

"మరి... యీ రోజో?"

"మా అగసాట్లు మావి. రోజూ బడికి పంపకుంటే మీరూరుకుంటారా?" అంటూ వెళ్లింది.

తర్వాత చాలాసార్లు బడి వద్దకొచ్చింది.

సుభద్రగా పరిచయమైంది.

బెరుకుదనం తగ్గి చనువుగా మాట్లాడటం మొదలెట్టింది.

మా హెడ్‌టీచర్ రెణ్నెళ్లు సెలవు పెట్టాడు. ఆయన భార్యకు గొంతుకింద గడ్డలేచి కేన్సర్‌గా అనుమానమొచ్చి ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి వచ్చిందట.

ఒక్కణ్నే కావటం వలన మరింత చనువుగా బడిలో కొస్తోంది సుభద్ర. విరామ సమయాన్నంతా సులభంగా ఖర్చుజేస్తోంది.

ఆమెతో మాట్లాడుతున్నంతసేపు గెట్టుమీద నిల్చుని పచ్చని పైరుమీద గాలితో ఒళ్లంతా గిలిగింతలు పెట్టించుకొన్నట్లుంటుంది. పంపువద్ద నిల్చుని అందులోంచి దూకే నీటి గలగలల్ని వింటూ, శరీరాన్ని తాకే తుంపర్ల స్పర్శా సుఖాన్ని అనుభూతిస్తున్నట్లే వుంటుంది.

మావూరి పొలాల్లోకి చాలాసార్లు వచ్చిందట. మిరప కోతలకో, సెనక్కాయ పీకుళ్లకో కూలిపనికోసం మా యిల్లు కూడా తెలుసట.

"మీరు సెనగపైరేయలేదా సార్?" అడిగింది.

"నా స్వంత వ్యవసాయమంటూ ఏమీ లేదు. భూములన్నీ కోరుకో, గుత్తకో యిచ్చినా."

"ప్చ్.. వేసుంటే బావుండు.."

"ఏం?"

"నీకు కూలికొచ్చేదాన్ని గదా! మీ చేలన్నా చూసేదాన్ని.." అంది నవ్వుతూ.

"నేను స్వంతంగా పైరుబెడితే నాకు కూలిగిట్టుబాటు గాదు." చెప్పాను. "అయినా రేపు సంవత్సరం ఒక్క ఎకరా అయినా ప్రయత్నిస్తా."

"ఎందుకూ?"

"నిన్నూ కూలికి రప్పించుకొనేందుకు."

ఫక్కున నవ్విందామె.

నాతో చనువు పెరిగే కొద్దీ సుభద్ర రాకపోకలు ఎక్కువయ్యాయి.

ఆమె వచ్చినప్పుడంతా ఐదవ తరగతి పద్మ మొహం మాడ్చుకొంటోంది ఎందుకో. నాకయితే ఆశ్చర్యం కలిగింది. ఒకనాడు నావద్దకొచ్చి రహస్యంగా చెప్పింది కూడా ఆ పిల్ల "సార్! ఆమెతో మాట్లాడొద్దు" అని.

సుభద్ర మంచిది కాదుట. ఆమె తల్లి సుబ్బమ్మ మంచిదికాదుట. గబ్బు మాసులట, ఎందుకు చెడ్డవాళ్లో చెప్పమంటే 'అదంతా చెప్పేది కా'దుట.

నవ్వొచ్చింది నాకు.

సాయంత్రం బోర్డుమీద లెక్కలేస్తోంటే వాకిట్లో ఎవరో తారాడినట్లుగా అన్పించి అటుకేసి చూశాను.

ఎవరో ఆడమనిషి - చింపిరిజుత్తుతో, నోటినిండా ఎర్రగా పండిన వక్కాకుతో ఎండిన రేగ్గంప మండలా వుంది.

లోపలికి అడుగేస్తూనే పెంకులు పగలేసినట్లు మాట్లాడసాగింది.

"మా పిల్లోడు బడికొస్తాండడా సారూ?" అడిగింది.

నేను పిల్లలవైపు చూశాను ఎవరన్నట్లుగా.

సుధాకర్ లేచి నిల్చున్నాడు.

ఆమె ఎవరో అర్థమైంది.

"వస్తాండాడు లేమ్మా! రోజూ వస్తాండు.." చెప్పాను.

"యాడొస్తాండు. లోకమ్మటి నారాయణ అంటా వాళ్లక్క తోడొచ్చేగాని రాడు" అంటూ బైటకు తిరిగి తుపుక్కున వూసింది వాకిలిముందే.

"అట్లా అలవాటు చేసింది మరి." అన్నాను.

"తమ్ముడంటే టో ప్రేమలే సారూ ఆ పిల్లకు. తెలివిగలిగింది. యీ వూర్లో లేదనుకో అటువంటి పిల్ల. నీ సుద్దిగూడా ఎత్తుకొంటది. నువ్వు మంచోనివంట. పిల్లోల్లకు బాగా సదువు చెప్తాతావంట.."

కొంతసేపు మాట్లాడి "వస్తాసారూ!" అంటూ వెళ్లిందామె.

బైటకొచ్చి చూశాను.

ఆకుల మీద అగ్గి తెగులు మచ్చల్లా అసహ్యంగా - బడి ముంగిట్లో వక్కాకు మరకలు.

రోజూ ఒక్కసారయినా బడికేసి రావటం, నాతో రెండు మాటలయినా మాట్లాడిపోవటం సుభద్ర దినచర్యలో భాగమైంది. మరీ తీరిక లేకున్నపుడు గడ్డిగంప నెత్తిమీంచి దించకుండానే వాకిట్లో దాకా వచ్చి పలుకరించిపోతుంది.

మా వూరికీ యీ వూరికీ రెండు కిలోమీటర్లలోపే దూరమవటం వలన నేను సైకిల్‌లో వచ్చిపోతుంటాను. మధ్యాహ్నం కూడా ఇంటికెళ్లి వస్తుంటాను.

ఆమె చదువుకోలేదని తెలిసి ఆశ్చర్యపోలేదుగాని చదువు నేర్పితే బావుంటుందేమో అనిపించినపుడు కొత్తగా తోచింది. ఊర్లో నిరక్షరాస్యులందరినీ వదిలేసి ఆమెమీద మాత్రమే నా ప్రత్యేక దృష్టి ఎందుకా అనిపించింది. ఏదేమైనా అంత అందమైన అమ్మాయికి చదువు రాకపోవటం లోపంగానే తోచింది.

ఆరోజు వీధిలో ఏదో గొడవ. పేడకో, కసవుకో, కోడికో వచ్చిన గొడవ. ఆడవాళ్లు జుట్లు జుట్లు పట్టుకొని తిట్టుకొంటున్నారు. చుట్టూ జనం సంబరంగా చూస్తున్నారు. జనం మధ్యనించి వచ్చింది సుభద్ర "ఊరికే సూడకుంటే విడిపిస్తేనేం సారూ! ఆ పంచాయితీ యేందో తీరుస్తేనేం?" అంది.

"నాకెందుకు మీవూరి గొడవలు? ఒకరి విషయాల్లో మరొకరం వేలు పెడితే వొచ్చేవి ఇబ్బందులే.." చెప్పాను.

"రేపు నాకేదైనా ఇబ్బంది జరిగినా యింతేనా సారూ?"

"అది పద్ధతయిందీ, పదిమందీ సమ్మతించే సమస్య అయితే తీర్చొచ్చు. దొంగో ముచ్చో గుడిసెల్లో దూరే తప్పో అయితే దూరంగా వుండటమే మంచిది."

ఎందుకోమరి ఆమె నాకేసి కొన్ని క్షణాలు తదేకంగా చూసింది.

"పైటేల అంతదూరం ఎండలో ఎండుతా పోయిరాకుంటే ఒక పిడచ బువ్వదెచ్చుకుంటేనేం సారూ!" అంది మరో మధ్యాహ్నం.

"మా వూరికి ఎంతదూరం? పదినిమిషాల ప్రయాణం.."

"ఎండకు ఏమంత ఖర్మనీ.."

ఆలోచించాను.

మరుసటిరోజు ఆమె వచ్చినప్పుడు చెప్పాను "నువ్వు చదువు నేర్చుకొంటానంటే నేను క్యారియర్ తెచ్చుకొంటా" అని.

"నేనా! ఇప్పుడా!" ఆశ్చర్యంగా ముక్కుమీద వేలేసుకొంది.

"నువ్వే. ఇప్పుడే.."

"నాకెందుకులే సార్ సదువు..."

"చదువుకోవలసిన అవసరాన్ని గురించి వివరించాను.

ససేమిరా ఒప్పుకోలేదు.

చివరగా మామధ్య ఒప్పందం కుదిరింది - నేను క్యారియర్ తెచ్చుకొంటే తను అక్షరాలు నేర్చుకొంటుందిట.

నా ఎండ తాపానికీ, ఆమె అక్షరాభ్యాసానికి మధ్య లింకు కుదరటం నాకెందుకో పూర్తిగా అర్థం కాలేదు. అయితే - మొక్కజొన్న కంకిలా కొంతసేపు మౌనంగా నిల్చుని, తర్వాత "సరే సార్!" అంటూ నా ప్రతిపాదనకు ఆమె అంగీకరించినప్పటి దృశ్యం నేను మరచిపోలేకున్నాను.

అప్పట్నించి బడిలోకి వచ్చినపుడంతా పలక చేతిలోకి తీసికొంటుంది. పనిలేని రోజు మధ్యాహ్నం గంటసేపు నాఎదుటే గడుపుతుంది. అక్షరాలు దిద్దుతుంది. ముద్దుగా పలుకుతుంది రావని. మొండికేసినపుడు బెత్తం వూపితే భయాన్ని అభినయిస్తుంది. ఏ కోణాన్నించి చూసినా మెండుగా పెరిగి నిండుగా పూసిన కందిచెట్టులా అందంగా కదలుతుంది.

ఏదో జోకు మా మధ్య పేలి పగిలిన కెరటాల్లా విరగబడి నవ్వుకొంటోన్న రెండు మధ్యాహ్నాలు గుమ్మంలోకి వచ్చి తొంగి చూసి వెళ్లింది సుబ్బమ్మ.

ఒకనాడు గంప చంకన బెట్టుకు పోతూ "సారూ! నీకిద్దరూ ఆడపిల్లోళ్లేనంటనే! అంది.

"అవునమ్మా!" చెప్పాను.

"ఇంకేం పుద్తారబ్బా మొగపిల్లోల్లు.." చింపిరి జుత్తులోకి వేళ్లు జొనిపి గీరుతూ అంది.

"మీరే అల్లంటే ఎట్లమ్మా?... ఆడవాళ్లయీ.."

"ఆడోల్లమయిందాన్నే అనేది. మా కస్టాలు మాకు దెలుస్తయి."

"అయినా ఆడమగ మన చేతిలో ఏముందెమ్మా?" అన్నాను.

"మల్లా పెండ్లి జేసుకో. మొగపిల్లోడు పుద్తాడు.." అంటూ కిసుక్కున నవ్వి తుపుక్కున వూసి వెళ్లిపోయింది సుబ్బమ్మ.

"సార్ సార్! సుభద్ర గబ్బుది. వాల్లమ్మ అంతకన్నా గబ్బుది. వాల్లతో మాట్లాడగాకు సార్!" పద్మ నస.

ఆరోజు క్యారియర్ తెచ్చుకోలేదు.

మధ్యాహ్నం ఇంటికెళ్లాను.

భోంచేసి తిరిగి వస్తోంటే, మా చేలకు ఇవతలగా జ్యోతివాగు జేడెల్లోంచి "సార్!" అంటూ చిన్నకేకలాంటి అరుపు.

సైకిల్ స్లో జేస్తూ వెనక్కి తిరిగి చూశాను.

ఎవరూ కన్పించలేదు.

వెళ్లబోతోన్నంతలో మళ్లీ అదే కేక.

బ్రేకులేశాను.

సైకిల్ రొదలో ఆ కంఠం స్పష్టంగా విన్పించకున్నా అనుమానమొచ్చింది.

సైకిల్ దిగి స్టాండేసి వెనక్కి చూశాను.

వంక జేడెల్లోంచి నడిచొస్తోంది సుభద్ర - ఎండ తాకిడికి సోలిపోతూ నెత్తిన కొమ్ముల భారంతో మెల్లిగా అడుగులేసే జింకలా - తలమీద గంపతో.

"అలసంద కాయలు కోసుకొస్తాండ.." గంప దించింది. ఎందు కాయల్లో అక్కడక్కడా కలిసివున్న దోరకాయల్ని ఏరి నాచేత బెట్టింది.

వాటిని వొల్చుకు తింటోంటే అడిగింది "క్యారీ తెచ్చుకోలేదేం సార్?" అని.

"తెచ్చుకొనింటే యిదో.. యీ కాయలు తినే ప్రాప్తముండేది కాదు గదా!" అన్నాను నవ్వుతూ. "అవునూ.. ఇవి సంక్రాంతి వడలకా!"

"ఆ..."

"దోసకాయల్లేవా?"

"లేవు. పెసరగాయలుండాయి."

"సరే... టైమయింది.." అంటూ సైకిలెక్కాను.

"సార్ సార్! ఒకమాట.."

ఏమన్నట్లుగా ఆమెకేసి చూశాను.

"కాదననంటే చెబుతా.."

చెప్పమన్నట్లుగా తలాడించాను.

కొంతసేపు తటపటాయించింది ఆమె. పెదాలు బిగబట్ట రెప్పల చాటుగా నాకేసి చూసింది. ఎదల్లోంచి తోసుకొచ్చిన సిగ్గుదొంతరలేవో ఆమె బుగ్గలదాకా పాకాయి - వేరుకు అందిన చెమ్మ ఆకుల ఉపరితలానికి పాకినట్లు.

మెల్లిగా చెప్పింది "నాకు.. నాకు సైకిల్ ఎనక కూచోవాలనుంది." అని.

ఫక్కున నవ్వాను.."దీనికింత సిగ్గా?" అంటూ.

తర్వాత అర్థమైంది అదెంత బరువైన పనో!

'ఎవరైనా చూస్తే బావుండదేమో' అనే అనుమానం.

మలుపుదాకా చూశాను. ఎవ్వరూ లేరు.

కింద బలంగా కాలూని "ఎక్కు" అన్నాను.

వెనక క్యారియర్ మీద కూచుని గంపను కాళ్లమీద పెట్టుకొంది. ఒక చేత నా భుజం గట్టిగా పట్టుకొంది.

సైకిల్ కదిలించాను. చిరకాల వాంఛ తీర్చుకొంటోన్న ఆమె హృదయ స్పందనల్ని నావిగా అనుభూతిస్తూ తొక్కుతున్నాను.

మలుపు తిరిగేసరికి కంపచెట్ల చాటున్నించి ఎదురయ్యాడు ఆవూరి మనిషి. మావైపు వింతగా చూశాడు. అరిచే ముందు శరీరాన్ని కుదించి, మెడముందుకు చాచి చూసే కాకిలా చూశాడు.

ఆమెను దించేందుకు సమయం లేదు.

అంకయ్యగారి బావివద్ద కొచ్చేసరికి మరో కాకి కంట్లో పడ్డాము.

నా గుండె లయ తప్పింది.

కాకిగోల మొదలవుతుందేమో!

ఆమెను వూరవతలే దించి బడికి వెళ్లాను.

సాయంత్రానికి అర్థమైంది నన్ను చూడగానే చాలామంది పెదాలమీదా, కళ్లల్లోనూ కదలాడే నవ్వు తెరల్ని గమనించి - మా సైకిల్ ప్రహసనం వూర్లో చర్చనీయాంశమైందని.

గుండెల్లో బెరుగ్గా వుంది - చెడ్డగా వూహించుకొంటున్నారేమోనని,

ఒళ్లంతా పదరుగా వుంది - నిలదీసి ప్రశ్నిస్తారేమోనని.

మరుసటి రోజు మధ్యాహ్నం పచ్చడి తెచ్చుకొన్నానని తెలిసి చిక్కుడు కాయ పులుసు పట్టుకొచ్చింది సుభద్ర.

నన్ను కలవరపెట్టే అలజడి ఆమె మొహంలో ఏమాత్రం కనిపించలేదు.

"నిన్ను సైకిల్లో ఎక్కించుకు రావటం, వూరోళ్లంతా చెవులు కొరుక్కోవటం.. వాళ్ల కేమీ పన్లేదా?" అన్నాను.

"కొరుక్కోనీ సార్! - వాళ్ల చెవులే పోతాయి. మనం తప్పుచేయనపుడు భయమెందుకు?" నిర్భీతిగా అంది నాకళ్లల్లోకి చూస్తూ.

నాకాశ్చర్యం కలిగింది.

సాయంత్రం సుబ్బమ్మ వచ్చింది బడివద్దకు.

"ఏమ్మా! సుధాకర్ కోసమా?" అడిగాను.

"కాదులే సారూ! సుభద్ర వుందేమోననీ.." సాగదీసింది.

ఆ మాటల్లో ఏదో అసహజత్వం తోచింది నాకు.

"ఐడిడ్సి రాడమేలే.. ఏమ్మంత్ర మేసినవో ఏమో! ఇంటికాడ లేకుంటే యీడుందెని వొచ్చినా.. యాడికి పంపినచో సెప్పుసారూ!" అంది వంకరగా నవ్వుతూ.

గరిసె బండల్ని ఎలుక గీరుతోన్నపుడు వచ్చే శబ్దం లాంటి ఆ నవ్వు నా వొళ్లంతా కంపరం రేపింది.

"మధ్యాహ్నం వొచ్చింది అంతే.." చెప్పాను.

"యాడికి పొయ్యిందబ్బా!" గొణుక్కొంటూ వెనుదిరిగింది సుబ్బమ్మ.

మా పద్మ మెటికలు విరుస్తూ వుంది.

సుభద్రను అడిగాను పద్మ ఆరోపణల్ని గురించి

కొంత మౌనం తర్వాత అంది" ఆ పిల్ల మాటల వెనక ఒక కత వుందిలే సార్! ఎప్పుడోకసారి సెబుతాలే.." అని.

సంక్రాంతి సెలవులొచ్చాయి.

సెలవుల్లో రెండుసార్లు తోటవద్ద కలిసింది సుభద్ర.

కళ్లాల నిండా ఎర్ర తివాచీల్లా పరచుకొన్న పండు మిరపల్ని గురించీ, పొద్దు తిరుగుడుపూల గురించీ, బడి పిల్లల గురించీ మాట్లాడింది. నేర్చుకొన్న అక్షరాల్ని బావి మొత్త బండల మీద రాసి చూపించింది. పద్యాలు అప్పచెప్పినపుడు చెవి పట్టుకొంటే గలగల నవ్వింది. అరచేయి చాచి జాతకం చెప్పమంది. ఆ వూరి వాళ్ల కళ్లల్లో కూడా పడింది.

రాత్రి పడుకొన్నపుడు సుభద్ర గుర్తొచ్చింది. ఆమె మాటలు, నవ్వూ, నడకా చిరుస్పర్శ నన్నేదో భ్రమల్లోకి నెట్టాయి.

నా మీద నాకే అనుమానం కలిగింది.

ఊరివాళ్లంతా అనుకొంటున్నట్లుగా ఆమెపట్ల నాకు వ్యామోహమే ఉందేమో! ఇది కేవలం స్నేహంగానే మిగిలిలేదేమో! ఆమెలోని ఆడతనాన్ని నేను కోరుకుంటున్నానేమో!

ఉలిక్కిపడ్డాను. మా యిద్దరికీ మరింత ఏకాంతం దొరికితే యీ కొద్దిపాటి విచక్షణ కూడా కోల్పోతానేమో! తనుకూడా సహకరించేట్లే వుంది.

భయం కలిగింది. అపరాధ భావన ఒకటి కమ్మింది. మరోవైపు లోలోపల ఎక్కడో ఆమె సాన్నిహిత్యాన్ని బలంగా వాంచిస్తూ సన్నని నిప్పుకణిక.

సెలవులై పోయాయి.

మా హెడ్ కూడా జాయినయ్యాడు. కేన్సర్ కాదుట. ఆపరేషన్ సక్సెస్ అయ్యిందిట. సంతోషంగా వున్నాడు.

మధ్యాహ్నం ఆయన ఇంటికెళ్లగానే బడిముందు బోరింగ్ వద్ద కాళ్లు మొహం కడుక్కొని వచ్చి అన్నం క్యారియర్ బైటకు తీశాను.

అప్పుడూ కిటికీలోంచి గాజుల చేయి ఒకటి లోపలికి సాగింది. కాగితపు పొట్లం టేబుల్ మీద పెట్టి చేయి అదృశ్యమైంది.

అందుకొని విప్పితే అలసంద వడలు.

"సుభద్రా!"లో గొంతుకతో పిల్చాను.

సమాధానం లేదు.

కిటికీ గుండా బైటకు చూస్తే - ఎవ్వరూ కన్పించలేదు.

ఆమె ప్రవర్తన కొత్తగా వుంది. అర్థం కాకుండా వుంది .ముడి వీడని లెక్కలా మెదడులో కదలుతూనే వుండిపోయింది.

బడి వదలి వూరుదాటగానే రెండవ తరగతి నరసింహులు తండ్రి ఎదురయ్యాడు. మాటలు కలిపాడు ఆ సందట్లోనే అడిగాడు "నీకు రొండో పెండ్లంటనే సార్!" అని. ఉలిక్కి పడ్డాను. "నాకు పెండ్లయి ఐదేండ్లయింది. ఇద్దరాడపిల్లలు.." చెప్పాను.

"తెల్సుసార్! మొగపిల్లోని కోసం చేసుకొంటున్నావంటలే.."

"ఎవురయ్యా అన్నది?"

"ఇంగెవురు. సుబ్బమ్మ.. ఆమె కూతుర్నేనంటగదా!"

అదిరి పడ్డాను.

ముసిరే మేఘాల్ని చూసి ఉరుములు మెరుపుల్నే వూహించాను. మహా అయితే వడగళ్ల వాన వస్తుందనుకొన్నాను గాని యిలా హఠాత్తుగా పిడుగే పడుతుందనుకోలేదు.

సుబ్బమ్మను చూసినపుడల్లా ఆమె ప్రవర్తన నాలో ఏవో స్పష్టంకాని అనుమానాల్ని రేకెత్తిస్తుండేదిగాని, దానికి ఇలాంటి రూపం ఉంటుందనుకోలేదు.

మనసంతా చీకాకుగా వుంది. కొమ్మల్లోకి పాకుతోన్న గొంగళి పురుగు స్పర్శకు కంపించే వేరుసెనగ మొక్కలా వుంది మెదడంతా.

మరుసటి రోజు ఇంటర్వెల్ సమయంలో మా హెడ్ టీచర్ అన్నాడు "ఏమయ్యా రెడ్డీ! మా వూర్లో ఎవరినోట విన్నా నీమాటే గదయ్యా! నలుగురు కూచుంటే చాలు నిన్ను గురించే గదయ్యా!" అని.

నిరుత్తరణ్ణయి చూశాను. నోరు పెగల్లేదు. మొహం వెలవెల బోయింది. ఇతరులు వ్యాఖ్యానించుకోవటం వేరు. ఈయన నమ్మటం వేరు.

"ఏమంత ఘనకార్యం చేసినానని సార్?" తేరుకొని అన్నాను. నేను మాట కలిపిన తీరు నాకే ఎబ్బెట్టుగా వుంది.

"ఇంకేం చెయ్యాలయ్యా స్వామీ? నేను లేకుండా జూసి యీ రెన్నెళ్లలోనే రొండో పెండ్లాన్ని వెతుక్కొన్నెవంటనే.." మొహమాటం లేకుండా అన్నాడు.

గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది నాకు.

"ఎవుర్సార్ అన్నెది?" వంగిగా వుంది నా గొంతు.

"ఒకరనేదేముంది - పుట్టిన బిడ్డకాన్నించి చచ్చే ముసిలోడిదాకా... ఆమెను రెండుసార్లు సైకిల్లో మీవూరిగ్గూడా తీసకపోయినావంట. మీ భార్యకు చూపించి పర్మిషన్ కూడా తీసుకున్నెవంట. రోజూ మీ పొలాల కాడా, వంకల్లో వాగుల్లో కలుస్తున్నారంట. అల్లుని హోదాలో వాళ్లింటి కూరలు కూడా బల్లోకి తెప్పించుకొంటున్నావంట.."

నాకయితే వూపిరి పీల్చుకోవటం కూడా కష్టమైంది.

స్తబ్దున్నై నిల్చిపోయాను.

ఎన్ని కథలు అల్లుకొన్నాయి! ఎన్ని పురాణాలు పుట్టుకొచ్చాయి.

"అన్నీ అబద్ధాల్లే సార్!" చెప్పాను.

"అబద్ధమైతే మరి.. పైటేల రోజూ ఇంటికి పోయేవానివి గదా! ఇప్పుడు క్యారియర్ తెచ్చుకొంటున్నావు ఎందుకు?" నవ్వుతూ ప్రశ్నించాడు.

నన్ను నేను స్వాధీనంలోకి తెచ్చుకొన్నాను.

దీన్ని మరింత పొడిగించటం మంచిదికాదనిపించింది.

కొద్దిసేపు మౌనం తర్వాత తలెత్తి ఆయనకేసి చూస్తూ "మీరు విన్నిందొకటి జరిగింది మరొకటి సార్! సమయమొచ్చినపుడు అన్ని విషయాలూ నేనే చెబుతాను. ఇప్పుడు నన్నేమీ అడక్కండి.." అన్నాను ఖచ్చితంగా.

తర్వాత మరేమీ మాట్లాడలేదు ఆయన.

నాకిప్పుడు ప్రపంచమంతా ఇరుగ్గా కన్పిస్తోంది. ఎక్కడా ఇమడలేనితనం. ఎటు చూసినా వెక్కిరించే నొసళ్లు. ఎగతాలి చేసే కళ్లు. ఎకసక్కెములాడే పెదాలుగానే కన్పిస్తున్నాయి. ఊరిజనం ఎవ్వరెదురైనా మొహం చాటేసుకొంటున్నాను. పిల్లల తల్లిదండ్రులెవరైనా బడిలోకొస్తే వాళ్లు వెళ్లే దాకా ముళ్లమీద నుంచున్నట్లుంటుంది.

ఇంటికెళ్లినా అదే ఆలోచన. కళ్లపైన నిద్రవాలటం లేదు. మనస్సు పైన ప్రశాంతత వచ్చి కూచోలేదు.

నా అవస్థ పసిగట్టినట్లుంది మా ఆవిడ. "తెల్లార్లూ నిద్రబోకుండా మసల్తా వుండావే. ఏమీ? వొల్లు బాగ లేదా?" అంటూ ఆదుర్దాగా నాచేయి అందుకొంది. నుదుటి మీద తాకి చూసింది.

"ఏం లేదులే.." అంటూ మరో వైపు తిరిగాను.

ఉదయం నిద్రలేచింది మొదలు ఏదో నీరసంగా వుంది. బడి సమయమయ్యేకొద్దీ ఆందోళన పెరుగుతోంది. గుండెల్లో సన్నని పదరు ప్రారంభమవుతోంది.

సైకిల్ తొక్కుతున్నానేగాని మనస్సు నా ఆధీనంలో లేదు.

మా పొలాలు దాటి, జ్యోతివాగు జేడెలదరికి వచ్చేసరికి ఎదురు మలుపులో ఆడమనిషి.

తృటిలో పోల్చుకొన్నాను. అంతే వేగంగా సైకిల్ని వెనక్కి తిప్పుదామనుకొన్నానుగాని సాధ్యం కాలేదు.

"నిలబడు సారో!" చేతులూపుతూ అంది సుబ్బమ్మ.

నా గుండె చప్పుళ్లు నాకే స్పష్టంగా విన్పిస్తోండగా ఆగాను.

"నీతో మాట్లాడాల సారూ!" నా దగ్గరగా వస్తూ అంది.

సైకిల్ దిగాను.

ఆమె మాట్లాడేదేమిటో తెలిసిపోతూ వుంది. తప్పని సరిగావినాలి.

ముక్కుపుటాలు ఒరుసుకు పోయేలా గాలిపీల్చి వదలటంలో కొంత టెన్షన్ తగ్గించుకొన్నాను.

"ఏం సారూ తగ్గినట్లుండావూ?" అంటూ ప్రారంభించి, చేలగురించీ పంటగురించీ కరువు గురించీ మాట్లాడింది. ఆ వూరి ఆడపిల్లల గురించీ వాళ్లల్లో ఆణిముత్యంలాంటి తన కూతురు సుభద్ర గురించీ చెప్పుకొచ్చింది. వరసలు కలిపింది ఏదారినుంచో తీసుకొచ్చి మా కుటుంబంతో వరసలు కలిపింది. తర్వాత అసలు విషయానికి వచ్చింది.

"యీ ఉగాదికి మా సుభద్ర పెండ్లి జెయ్యాలనుకుంటాండం సారూ!" అంది.

"చెయ్యండి. మంచిదేగదా!" తప్పించుకొనే దారెక్కడ దొరుకుతుందా అని వెదకుతున్నాను.

"మాలాంటోల్లకు ఆడపిల్ల పెండ్లి జెయ్యాలంటే మాటలా సారూ? అక్కడికీ కయ్యో కాలవో అమ్మి సేజ్జామనుకొన్నేం."

"మేనరికమా?"

"ఆ.. మా ఆడబిడ్డ కొడుకే వుండాడు. అర్దెకరా బూమిస్పామన్నేం. సేసుకుంటానన్నెడు.."

నమ్మలేనట్లుగా చూశాను. ప్రవాహంలో కొట్టుకుపోతున్న వాడికి కొయ్యముక్క దొరికినట్లుగా అనిపించింది.

"పిల్ల రెడీగా వుంది పిల్లోడూ ఓకే.. ఇంకేం చేసేయండి పెండ్లి.." అన్నాను హుషారుగా.

"అనాబట్ట ఇప్పుడు అడ్డం తిరుక్కున్నెడు."

"ఎందుకంట?"

"ఏందేందో కూస్తాండు. లోకమంతా నీయట్లాటోల్ల వుంటారా సారూ!"

"ఏమంటున్నాడు?" ఉత్సాహం నీరు గారింది.

అడపంలోని సున్నాన్ని నోటరాల్చుకొంటూ తుపుక్కున ఎంగిలివూస్తూ "మా యమ్మి సెడిపొయ్యిందెంట. వానెక్క వానెమ్మ పతివర్తలంట." విసురుగా అంది.

"సదవు జెప్పేటోడివి నీతో సావాసంగా మాట్లాడితే తప్పుబడ్తాండారు. నా నోటితో సెప్పగూడదుగాని హీనంగా మాట్లాడిండు సారూ! "గొంతుజీర వోతుండగా ముక్కుచీదింది. "రోజూ నీకాడ పండుకుంటాండెంట. చేలంబడి మీరేనంట. చెట్లంబడి మీరేనంట. మావూరినించి మీవూరిదాకా దోవంతా మీరేనంట. నువ్వు బడికొచ్చేది పిల్లోల్లకు సదువుజేప్పేదానికి కాదుట. మాయమ్మికి అవేవో పాటాలంటనే.. అవి జెప్పే దానికంట..."

నాకు నోట మాట రాలేదు.

"వాడు సేసుకోనన్నెడు సారూ! 'నువ్వేందిరా మూడుగాసుల్నాబట్టా – నీ తాతట్లాంటోల్లు వొస్సరులే' అన్జెప్పినా. కులస్తులనూ సుట్టపక్కాలనూ యీసారించినా. 'దాని బావే వొద్దన్నెడు మేమేడ సేసుకుంటాం! 'ఆ సారుకే యిచ్చి సెయ్యి అ'న్నెరు. వీల్లా వానిమాటే మాట్లాన్నెరు. నాకు తిక్కరేగి "ఒరేయ్! నా బిడ్డ బంగార్రా! యీ బంగారును మీకిచ్చేదెవుర్రా? ఆ అర్దెకరా బూమిచ్చి సారుకే పెండ్లి జేస్పా. మీకండ్లు కుట్టిసావాల నాకొడకల్లారా!" అని తిట్టివొచ్చినా." అంది తమలపాకు తీసికొంటూ.

పరిక్కంపలో ఇరుక్కొన్నట్లుంది నా పరిస్థితి. ఏ వైపుకు కదలినా ఒళ్లు చీరుకు పోతుంది.

"మాయమ్మికేం సారూ! – కన్నొంకరా? కాలొంకరా? సేసుకో.. నీ పెండ్లాం యింట్లో జేస్పది. యీయమ్మి పొలంలో జేస్పది. నీ భూములన్నీ సాగు జేయిస్తది. సేసుకో.." అంది నవ్వుతూ.

"నాకెందుకమ్మా? – పెళ్లయి యిద్దరు పిల్లలున్నవాణ్ణి –" దైన్యంగా చెప్పాను.

"అట్లంటే ఎట్ల సారూ? నీ సావాసం పట్టినాంకనే దానికి సెడ్డపేరొచ్చింది. ఇప్పుడు దాన్నెవురు చేసుకుంటారు నువ్వుదప్ప.." అంది.

"యీ రొండో పెండ్లిగోల ఏంది తల్లీ?" తలపట్టుకొన్నాను. ఆమెకెట్లా చెప్పాలో అర్థం కాకుండా వుంది.

వెంటనే ఆమె మొహంలో రంగులు మారాయి.

"పెండ్లి చేసుకోనోనివి దాన్ని నీ ఎనకెందుకు తిప్పుకొన్నెవూ? దాని బతుకెందుకు నాశనం జేసినవూ?" గొంతు పెంచింది.

"బడిలో కొస్తావుండె.. మాట్లాడతావుండే.. అట్లా ఫ్రెండయింది. సావాసమే గాని సెడ్డ బుద్ధిగాదమ్మో మాది." మెల్లిగా చెప్పాను.

"సావాసంచేసే దానికి పెండ్లిగాని పిల్లే దొరికిందే! ఎవుతెన్నా మొగుడు సచ్చిన ముండను చూసుకోగూడదా!.. ఇదో సారూ! మంచోనివని మంచిగా సెప్పుతాండ. నీకు మాత్రం తప్పదు. రేపు వూర్లో పంచాతీ పెట్టిస్సా. నా కూతుర్నెట్లా చేసుకోవో నేన్జూస్సా.." అంటూ వెనుదిరిగింది.

నాకు పెదాలెండిపోయాయి. నాలుక పిడచగట్టుకుపోయింది. మెల్లిగా సైకిలెక్కాను.

"సాని ముండనుకొన్నెడేమో పిల్లోడు! రోజూ సేలంబడి సెట్లంబడి పండుకోడానికి.." ఏదేదో అంటూ వెళుతోంది.

శరీరమంతా కుంచించుకపోయింది నాకు.

ఎవరైనా వింటున్నారేమోనని అటు ఇటు చూశాను.

నా పరిస్థితి దయనీయంగా వుంది. అన్ని వైపుల్నించి ముట్టడించబడ్డాను. ఇబ్బందికరంగానే పరిణమించేట్లుంది.

నా దురదృష్టానికి నాకే జాలేసింది.

పద్మ మాటలు విన్నాను కాను. నెత్తీ నోరూ కొట్టుకు చెప్పింది పాపం. గడ్డం పట్టుకు బతిమాలడం ఒక్కటే తక్కువ.

ఈ గండాన్నించి బైటబడేదెలా?

విషయాన్నంతా మా ప్రధానోపాధ్యాయునికి వివరించాను.

అంతా విని దీర్ఘంగా నిట్టూర్చాడు ఆయన.

"రెడ్డీ! తల్లి మంచిది కాదు. పిల్ల కూడా అంతే. నువ్వావలలో ఇరుక్కొన్నావు. సమస్యనించి బైటబడాలంటే ఒకటే మార్గం. నెలో రెన్నెల్లో సెలవుబెట్టి, సెలవుల్లోనే ట్రాన్స్‌ఫర్ చేయించుకో.." చెప్పాడు.

సమయానికి అంత మంచి సలహా యిచ్చినందుకు కృతజ్ఞతలు చెప్పుకొన్నాను.

నాకిప్పుడు సుభద్రమీద కూడా అనుమానంగా వుంది - యీ కుట్రలో ఆమెకు కూడా భాగం వుంటుందేమోనని. తల్లి ఎత్తుగడను అక్షరాలా అమలు పరిచిందేమోనని. ఆమెతో మాట్లాడాలి.

బడి వదిలేటపుడు సుధాకర్‌తో చెప్పి పంపాను. 'మీ అక్కను మాచేల దిక్కురమ్మ'ని నేను వూరిదారిబట్టాను. జ్యోతివాగు జెడెల వద్ద దారి మళ్లించి సైకిల్‌ను వంకలో నిలిపి బావికట్టపైకి చేరాను.

ఆమె కోసం ఎదురుచూస్తూ కూచున్నాను.

జరిగిన సంఘటనలన్నీ ఒకసారి వెనక్కి తిప్పి చూసుకొంటే నా తప్పే ఎక్కువగా కన్పిస్తోంది. ఈ దిక్కు మాలిన కవి హృదయం ఆమె అందాన్ని దూరాన్నించే చూసి ఆహ్లాదించవచ్చు. లోపలి పురుషభావం తనదైన శైలిలో కవిహృదయాన్ని నడిపించింది. సందేహం లేదు. ఆమెలోని ఆడతనం మీది మోహంతోనే యీ సహవాసం. సహజ సిద్ధమైన ఆడమగతేడాతోనే ఆలోచించాను. పురుషదృష్టితోనే చూశాను. ప్రవర్తించాను.

రేపట్నుంచి ఎటూ స్కూల్‌కు వెళ్లేది లేదు. సెలవుల్లోనే బదిలీ చేయించుకోవాలి. జీవితంలో మరెప్పుడూ విచక్షణ లేకుండా ప్రవర్తించకూడదు. అవలక్షణాల్ని సంస్కరించుకోవాలిగాని వాటివెంట పయనించకూడదు.

నా అనుమానం - సుభద్ర కూడా నాలాగే ప్రవర్తించిందని, అకర్షణకు లోనయ్యి వుంటుందేమోనని.

వంక జేడెల్లోంచి వచ్చింది సుభద్ర తమ్మునితో కలిసి.

రేగుపళ్లు కోసుకురమ్మని కుంటలోకి పంపించాను సుధాకర్‌ని. రేగుచెట్లు బాడుబోవచ్చాయి. జేబునిండా ఏరుకోవాలంటే చాలా సమయం పడుతుంది.

"రమ్మన్నేవంట. ఎందుకు సార్?" నాకేసి చూస్తూ అడిగింది.

"నీకు తెల్దా?"

సమాధానం చెప్పలేదు.

"ఎందుకు చేసినావీ పని? ఎన్నాళ్లనుంచి మనస్సులో పెట్టుకొని చేసినావు!"

"నేనేం జేసినా?"

ఆమె అమాయికత్వం నటిస్తోందని నా అనుమానం.

లోలోపల ఎక్కడో యివే ప్రశ్నల్ని మరో రూపంలో సంధిస్తుందేమోనని భయం.

"ఏమీ చెయ్యకుంటే మీ అమ్మ నా మీందికి ఎందుకొస్తది? నిన్ను పెండ్లి జేసుకొమ్మని ఎందుకడుగుతది? ఇద్దరూ కలిసే నాటకమాడింటారు గదూ!"

నాకేసి నమ్మలేనట్లుగా చూసింది సుభద్ర. కళ్లార్పకుండా అలాగే చూస్తూండిపోయింది. గుడ్లెంట నీళ్లుబికాయి. కనుకొలుకులు దాటి ప్రవాహమై బుగ్గల మీదుగా దూకాయి.

"నిన్ను మోసం జెయ్యడానికి సావాసం జెయ్యలేదు సార్!" అంది భారంగా. "మా యమ్మ సేతిలో నేను మల్లా మోసపోయినా. గౌరవంగా బతికే నిన్ను గూడా వీధుల్లోకి తెచ్చినా.. " పైటతో కళ్లు తుడుచుకొంది.

"అమ్మ మోసం చేయటమేమిటో నాకు అయోమయంగా వుంది.

"నేను మంచిదాన్ని కాదని ఎవురో పిల్ల సెప్పిందన్నెవు. గ్నాపకముందే సార్? సమయమొచ్చింది గాబట్టి సెబుతాండ.." అంటూ గట్టిగా ఒకసారి వూపిరి పీల్చుకొంది.

"మూడేండ్ల కిందట మావూరి వొగిసిపిల్లోల్లంతా చెక్కభజన నేర్చుకొంటాన్నెరు. భజన గురువు కూడా వొగిసోడే. పాతికేండ్ల లోపు మాసే. పేరు నర్సింహ. అయితే మనకులంగాదు. దేవుడెట్ల కలిపిండో మా యిద్దరి మనసులు కలిసినయి. నేను అయప్పనూ, అయప్ప నన్నూ ఓబులేసుని సాక్షిగా యిస్టపన్నెం. కండ్లు కనబడని వయస్సు తప్పుజేసినం. మాకది తప్పనిపించలే.. దేవుడు తప్పను కొన్నెడో ఏమో. నెలదప్పించిందు. ఆ సంగతి నేనెవురికీ చెప్పలే. ఇద్దరం లేచిపోయి ఎక్కడన్నా బతుకుదామనుకొన్నెం. మా వాళ్లకు తెలిసింది. దాయాదులకు తెలిసింది. కులపోల్లకు తెలిసింది. నర్సింహను పుట్టకొని కొట్టి కాల్లు చెయ్యిర్సి వూర్లోంచి తరిమేసిర్రు. నేనేమీ సెయ్యలేకపోయినా పిచ్చెక్కింది. సజ్జామనుకొన్నే. సచ్చి ఏం సాధించాలి? బతికే సాధించాలి. కడుపులో బిడ్డ పెరుగుతావుంది. కడుపులో అయప్పను చూసుకొన్నే ఎట్లయినా సరే బిడ్డను కనాలనుకొన్నే. పెండ్లి గాకుండా తల్లినైతే నాకంటే బరువు

ఇంకోకటుండదు గదా! నా బరువు మొయ్యలేక వాళ్లే నన్ను తీసప్పోయి నా నరసింహ దగ్గర వదిలి రావాల.. అందుకే ఐదునెలల్దాకా నా కడుపు సంగతి బైటబడకుండా దాచినా. తర్వాత తెలిసినా వాళ్లేం చేయలేక పోయిన్రు."

ఆశ్చర్యంతో గడ్డకట్టి పోయాను.

"ఇంట్లోంచి బైటకు రాకుండా కట్టడి జేసిన్రు. అన్నీ లోపలే. నన్నింట్లో బెట్టి బీగమేసి పొలం మీదికి పొయ్యేవాల్లు. ఆడికీ ఇరుగమ్మకు పొరుగమ్మకు తెలిసేట్టు జేసినా. మాయమ్మ నోటికి బయపడి మా యింటికి ఎవురూ రారు. అట్లట్లా నెలలైనాయి. ఎవురికీ తెలకుండా మంత్రసాన్ని పిల్చింది మాయమ్మ. నానోరుమూసి గుట్టు చప్పుడు గాకుండా కనేట్టు జేసిన్రు. నొప్పులతో మబ్బు గమ్మింది నాకు. తెలివొచ్చి చూసుకుంటే వొల్లంతా పచ్చిపుండాల వుంది. పక్క తడివిసూస్తే బిడ్డలేదు. ఆరాటంగా మంచమంతా చూసినా. బిడ్డలేదు. గుండె పగిలిపోయింది. గోడుగోడున ఏడ్చినా. నా బిడ్డను నాకిమ్మన్నె. నువ్వు రాచ్చెసివన్నే. ఏమేమో తిట్టినా. పచ్చి బాలెంతరాల్నని గూడా సూడకుండా మాయమ్మ నానోరు మూసి కొట్టింది.." భోరున ఏడ్చింది.

సముదాయించేందుకు కూడా నాకు శక్తి లేదు.

"మల్ల దెల్సింది సారూ! – నా బిడ్డను .. పానంతో వున్నె నా బిడ్డను.. గుటక తప్పుకోకుండా ఏడుస్తాందెని గొంతు పిసికి సంపిందెంట సారూ మాయమ్మ. దిబ్బలో బూడ్సి పెట్టిందెంట.. అది అమ్మగాదు సారూ. బ్రెమ్మరాచ్చేసి.."

ధారాపాతంగా కారే కళ్లను తుడుచుకొంది. బుగ్గల్ని రుద్దుకొంది. ముక్కుచీదింది. పెదాలు బిగబట్టి రెండుసార్లు బలంగా వూపిరి పీల్చి వదలింది. తర్వాత ఎటో చూస్తూ మాట్లాడటం మొదలుపెట్టింది.

"ఒక యేడాది పాటు ఇంట్లోంచి బైటకు రాలేదు నేను. గుండె గట్టి జేసుకొని మల్లా మామూలు మనిసినైనా. నాకు పెండ్లిజెయ్యాలని చాలా సమ్మందాలు సూసింది మాయమ్మ. ఎవురూ ముందుకు రాలే. వొచ్చినోల్లను నేను సెడగొడతాంటి.. పెండ్లే వొద్దనుకొన్నే. ఊర్లో చాలామంది నన్ను బెణకాలని చూసిన్రు. నా మనస్సు రాయైపోయింది. ఇదో ఇంతకాలానికి మల్లా నీకాడనే నేను బతికినా మనిద్దర్నీ చూసి మాయమ్మ తలకాయలో పురుగులు కదిల్నెయి. నన్ను నీకు ముడెయ్యాలనుకొన్నెది. నా బరువు దించుకోవాలని యెత్తేసింది. ఆమె కుట్రలో నాకు బాగం లేదు సార్!"

కొంతసేపు నిశ్శబ్దంగా ఆమెనే చూస్తూండి పోయాను. తర్వాత అడిగాను. "ఇప్పుడతను ఎక్కడున్నాడో నీకు తెలుసా?" అని.

"తెల్దు. అది తెలుసుకోవాలంటే నీతోనే అయిద్ది..."

నొసలు ముడేశాను.

"మీ బామ్మర్ది ఎవురో మిసెన్ డ్రైవర్ వుండాడంటనే. ఆయప్పకు కనపన్నేడని వినికిడి."

"ఇన్నిరోజులూ ఎందుకు చెప్పలేదు?"

"ఈ సంగతి తెలిసేసరికి నిన్ను అడిగేంత చనువులేదు. అడిగితే ఏమైనా అనుకొంటావేమోనని భయం యీసడించుకొంటావేమోనని భయం. ఇదెక్కడి పీడరా నాయినా అని మాట్లాడ్డం సాలించుకుంటావేమోనని భయం. సంగతి తెలిసినా నేనొక్కతెనూ పోయి యాడని వెతకాల? ఇరిగిన కాల్లు చేతులు కట్టుకొన్నాయో లేదో!

నాకు సాయం జేసేవాళ్లెవురూ లేరు. నువ్వయితేనే ఆయప్పను వెతికి తేగలవని నమ్మకం.. నన్నర్థం చేసుకొంటావని నిన్ను నేన్నమ్మిన రోజు చెబుదామనుకొంటె. నిన్ను నమ్మడానికి ఇంతకాలం పట్టింది.."

"నేను రమ్మన్నకాడికి రావడం.... నాతో ఒంటరిగా గడపడం.. నా బుద్ధి గడ్డిదినింటే. ఏం చేసుండేదానివి?"

ఒకసారి దీర్ఘంగా నిట్టూర్చింది ఆమె.

"దానిగ్గూడా సిద్ధపడే వొచ్చినా. మావోళ్లందర్నీ కాదని ధైర్యంజేసి మా యిద్దర్నీ కలపాలంటే ఇంతలావు పని ఎవురుజేస్తారు? అదీ వూరకే ఎవ్వరూ చెయ్యరు. నువ్వు కోరుకొంటే నీకాడ పండుకొని అయినా, నీ కోరిక తీర్చి అయినా యీ సాయం చేయించుకోవాలనుకొన్నే. నా కోసం కాలుసెయ్యి యిరిపించుకొని ఎన్ని కష్టాలు బడ్తాండాడో? యాడుండాడో..? కుంటోడైనా పర్లేదు. ఆయప్పను నేను సాక్కుంటా సార్! ఆయప్ప కాడికి పోవాల సార్!" వలవల ఏడ్చింది.

నా గుండె జల్లుమంది.

కళ్లు తడితడిగా మారాయి.

జేబునిండా రేగుపండ్లు యేరుకొచ్చిన సుధాకర్‌తో కలిపి ఆమెను వూరిదారి పట్టించాను.

భారమైన గుండెల్తో సైకిల్ వద్దకు నడిచాను.

పరిస్థితుల్నించి తప్పించుకొని పారిపోయేందుకు ఉపయోగించుకోవాలనుకొన్న సెలవుకు ఇప్పుడు అర్థం మారిపోయింది.

కాళ్లు విరిగిన ఆ భజనకాణ్ని వెదకి పట్టుకోవాలి. కాళ్లకు మువ్వలు కట్టాలి. చేతుల్లో గజ్జెలపలకలు అమర్చాలి.

● "ఆహ్వానం" మాసపత్రిక ప్రారంభ సంచికలో - ఏప్రిల్, 1993 ●